
సాక్షి గుంటూరు

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.



అంకమ్మతల్లికి పూజలు

దాచేపల్లి : తక్కెళ్లపాడులోని అంకమ్మతల్లి, గోపయ్యస్వామి, గంగమ్మతల్లి ఆలయాల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.

• జై జగ'నిజం'



ప్రతినిధుల సభకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మీయంగా పలకరిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చిత్రంలో మంత్రులు జోగి రమేష్, ఆర్కే రోజా

విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు జయహో జగనిజం అంటూ నినదించారు. రాష్ట్రానికి వైఎస్ జగన్ అవసరం అంటూ జయ గళమెత్తారు. సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం అంటూ గర్జించారు. ఈ సభలో జిల్లాకు చెందిన పార్టీ నేతలు స్ఫూర్తిదాయ ప్రసంగాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీ శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఈఓ, ఫెస్టివల్ ఆఫీసర్ సోమవారం పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల చెంత ఏర్పాటు చేస్తున్న కేశఖండన శాల, టికెట్లు క్యూలైన్ ఇతర పనులను తనిఖీచేశారు. ఉత్సవాలకు రెండు రోజులకు ముందుగానే పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లు, ప్రసాదం కౌంటర్లు, స్నాన ఘాట్లు, షవర్లు, క్యూలైన్లతో పాటు పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ ఈఈ ఎల్.రమాదేవి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. కనకదుర్గనగర్‌లో దేవస్థానం ఏర్పాటు చేస్తున్న ప్రసాదం కౌంటర్లను చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. దసరా ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

స్పందన అర్జీలు పెండింగ్ ఉంచొద్దు

జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: స్పందనకు వచ్చే అర్జీలను పెండింగ్ లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న, ప్రస్తుతం వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. పరిష్కారంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో అర్జీల పరిష్కారం వేగంగా జరగాలన్నారు. అనంతరం వచ్చిన 248 అర్జీలను జేసీతోపాటు గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, డెప్యూటీ కలెక్టర్లు వెంకట శివరామిరెడ్డి, లలిత, స్వాతి, జిల్లా అధికారులు పరిశీలించారు.

కారుణ్య ఉద్యోగం ఇవ్వండి



నా తండ్రి చెంచయ్య ఆర్టీసీలో పనిచేస్తూ 2008లో మరణించారు. కారుణ్య నియామకం ద్వారా నేను మాత్రమే అర్హుడను. నాకు కొంచెం అంగవైకల్యం ఉంది. దీనిని సాకుగా చూపించి ఉద్యోగం ఇవ్వడం లేదు. చట్టబద్ధంగా ఉద్యోగం పొందే హక్కు నాకుంది. అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. న్యాయం చేయండి.

– బి.చంద్రశేఖర్, పొన్నూరు.

కాలేజ్ యాజమాన్యం వేధిస్తోంది



ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులం పొన్నూరులోని వీఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో డిప్లమో చదువుతున్నాం. జగనన్న వసతి దీవెన నిధులు రెండేళ్ల నుంచి రావడం లేదని, మమ్మల్ని బయటకు వెళ్లిపోవాలని, హాస్టల్ ఖాళీ చేయాలని కాలేజీ యాజమాన్యం వేధిస్తోంది. న్యాయం చేయండి.

– వీఎస్ఆర్ కాలేజ్ విద్యార్థులు, పొన్నూరు

న్యూస్‌రీల్

సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలను విడుదల చేసినట్లు ఎమ్మెల్సీ ఏసు పోట్లూరు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని బొగ్గువాగుకు విడుదల చేశారని పేర్కొన్నారు. మండలంలోని గంటావారిపాలెం సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఈనెల 11వ తేదీ నాటికి సాగర్ జలాలు చేరుతాయని వివరించారు. 12 రోజుల పాటు సాగర్ జలాలు విడుదలవుతాయని మంచినీటి చెరువులు, కుంటలు తదితరాలన్నీ పూర్తిస్థాయిలో నింపాలని సూచించారు.

యార్డుకు 29,046 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,046 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 27,633 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,481 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

5కే రన్ బ్రోచర్ ఆవిష్కరణ




ఏఎన్‌యూ: గుంటూరులోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న ఓపెన్ 5కే రన్ బ్రోచర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య పి.జాన్సన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి జీవీఎస్ ప్రసాద్, పోటీల కమిటీ అధ్యక్షుడు నరాలశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా జైలులో పలు పోస్టులకు దరఖాస్తులు

పట్నంబజారు: గుంటూరు జిల్లా జైలు పరిధిలోని కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్స్ విధానంలో పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు గుంటూరు జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న డ్రైవర్‌కు రెండు పోస్టులకు రూ.18,500 జీతం ఇస్తారని పేర్కొన్నారు. అదే విధంగా కార్యాలయ సబార్డినేట్, వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వారికి రూ.15 వేలు జీతం ఇస్తారని వివరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు https//guntur.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి



మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గుడిలో(శివాలయం)లో జరిగే దసరా బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోరారు. నగరంలోని శివాలయంలో సోమవారం ఎమ్మెల్సీ హనుమంతరావు ఆప్కో మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవితో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయంలో జరుగుతున్న మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేసి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో ఎ.రామకోటిరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరెళ్ళ లక్ష్మీరాధిక, బోర్డు సభ్యులు కొల్లి ముసలారెడ్డి, రేఖా వకుళాదేవి, అద్దంకి వెంకటేశ్వర్లు, అర్చకులు బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యుడు తెలకపల్లి మహేష్ శర్మ, శ్యాంసుందర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దౌర్జన్యం



ఆక్రమణలను తొలగిస్తున్న జేసీబీ



దేవదాయ శాఖ ఏసీ కారుని అడ్డుకున్న ధూళిపాళ్ల నరేంద్ర

• దేవాదాయ శాఖ అధికారులపై జులుం

పొన్నూరు: పొన్నూరులో ప్రజోపయోగ కార్యక్రమాలను టీడీపీ అడ్డుకుంటోంది. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు అడుగడుగునా అవాంతరాలు సృష్టిస్తోంది. దాతల విరాళాల ద్వారా సంక్రమించిన భూములపైనా ఆధిపత్యం కోసం వెంపర్లాడుతోంది. తాజాగా పట్టణంలోని దేవదాయ శాఖ పరిధిలోని అవ్వారు ఆదెమ్మ ధర్మ సత్రంలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులను స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారు. దౌర్జన్యం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి టీడీపీ నేతలను నియంత్రించారు.

అసలేం జరిగిందంటే..

పాత పొన్నూరులో అవ్వారు బాపయ్య ధర్మపత్ని ఆదెమ్మ 1919లో 42 సెంట్ల భూమిలో ధర్మసత్రాన్ని స్థాపించారు. అప్పటి నుంచి సత్రం పరిధిలోని ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖ 20 ఏళ్ల నుంచి సత్రంలో కల్యాణ మండపం నిర్మించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని భావించింది. అయితే పలు కారణాలతో దశాబ్దాలుగా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆ స్థలంలోని కొంత భాగంలో నివాసాలు ఏర్పాటు చేసుకొని ఏడు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కోర్టు ఉత్తర్వుల మేరకు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఆక్రమణల తొలగింపు చేపట్టారు. గత నెల 8న తొలగింపుపై నివాసితులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెప్పారు. అయినప్పటికీ ఖాళీ చేయకపోవడంతో తొలగింపు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. నివాసిత కుటుంబాల నుంచి ఎలాంటి ప్రతిఘటనా ఎదురుకాకపోయినా మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రాద్ధాంతం చేశారు. దేవదాయ శాఖ ఏసీ కారును ముట్టడించారు. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని టీడీపీ నేతలను నియంత్రించారు.

జగనన్న కాలనీలో బాధితులకు నివేశన స్థలం

కోర్టు ఉత్తర్వుల మేరకు సత్రంలోని ఆక్రమణల తొలగింపు చేపట్టాం. నివాసితులకు గత నెలలో ఖాళీ చేయాలని నోటీసులు అందిస్తుంటే తీసుకోలేదు. వారందరికీ జగనన్న కాలనీలో స్థలం మంజూరైంది. 2009లోనే ఇల్లు ఖాళీ చేస్తామని అంగీకార పత్రం మీద సంతకాలు చేశారు.

– భవానీ ప్రసాద్, సత్రం కార్యనిర్వహణాధికారి

డీఆర్‌ఎం కప్ వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ విజేతల ప్రకటన



వాలీబాల్‌లో మొదటి స్థానం సాధించిన జెట్లీ జట్టుతో డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం సైమాన్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తదితరులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో జరుగుతున్న డీఆర్‌ఎం కప్ పోటీలలో క్రీడాకారులు సత్తాచాటుతున్నారని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు అంశాల్లో విజేతల వివరాలను వెల్లడించారు. వాలీబాల్ విభాగంలో మొత్తం 16 జట్లు పాల్గొనగా నాలుగు జట్లు విజేతలుగా నిలిచాయని వివరించారు. మొదటి స్థానం జెట్లీ జట్టు, ద్వితీయ స్థానం గుంటూరు రైల్వే, తృతీయ స్థానం గుంటూరు పోలీస్, నాలుగోస్థానం తెనాలి జట్టు సాధించినట్టు వెల్లడించారు. షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో 32 జట్లు పోటీ పడగా మొదటిస్థానం విజయసాయిరెడ్డి, జి.జితేంద్ర, ద్వితీయ స్థానం సిద్ధార్థ గౌతమ్, జయంత్, తృతీయ స్థానం సాయి, అబ్బాస్, నాలుగో స్థానం గుంటూరు రైల్వే జట్టు నుంచి జి.రాజ్‌పల్‌సింగ్, షేక్.రియాజ్ సాధించినట్టు తెలిపారు.

14 క్రికెట్ సూపర్ ఫైనల్స్

క్రికెట్ విభాగంలో మొత్తం 12 జట్లు పాల్గొనగా సూపర్ ఫైనల్స్‌కు డీఆర్‌ఎం–11, ఎస్పీ, పల్నాడు–11, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్–11 జట్లు చేరుకున్నాయని వెల్లడించారు. సూపర్ ఫైనల్స్ ఈనెల 14న నల్లపాడు పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయని, 15న ఫైనల్ పోటీ ఉంటుందని వివరించారు.

మర్కటాలపై మాయోపాయం



యడ్లపాడు: గ్రామంలో వానరాల బెడదను నివారించేందుకు లింగారావుపాలెం పంచాయతీ కార్యదర్శి జి.సురేష్‌కుమార్ వినూత్న ఆలోచన చేశారు. యూట్యూబ్‌లో చూసిన ఫన్నీ వీడియో ఆధారంగా మనిషికి గొరిల్లా వేషం వేసి కోతులను తరమాలని నిర్ణయించారు. తెలంగాణలోని ఓ గ్రామ సర్పంచ్ ఇలాంటి ప్రయోగమే చేసి ఫలితం సాధించినట్టు తెలుసుకుని అమెజాన్‌లో గొరిల్లా వేషపు తొడుగును రూ.ఏడువేలకు ఆర్డర్ చేసి తెప్పించారు. సోమవారం గ్రామంలో ఓ పారిశుద్ధ్య కార్మికుడికి గొరిల్లా వేషం వేయించి కోతులు అధికంగా ఉన్న కనపర్తి వీధిలో తిప్పించారు. దీంతో కోతులు భయపడి ఊరు విడిచి పరారయ్యాయి. కోతులు ఎప్పుడు గ్రామంలోకి వచ్చినా.. ఇలాగే గొరిల్లా వేషధారిని రంగంలోకి దించాలని పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. గొరిల్లా వేషధారికి రోజుకు రూ.450 చొప్పున వేతనం ఇవ్వాలని తీర్మానించింది. ఈ ఆలోచనకు సర్పంచ్ షేక్ కరీమూన్, ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, ఉపసర్పంచ్ శొంఠినేని శివప్రసాద్, గ్రామపెద్దలు ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, నంబూరి శివరామకృష్ణ సహకారం అందించినట్టు కార్యదర్శి తెలిపారు.

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



గుంటూరు ఈస్ట్: లాలాపేట శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడు గ్రూపు దేవాలయాల నూతన పాలకమండలి చైర్మన్, ధర్మకర్త మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా సూరినేడి దుర్గావర ప్రసాద్ ప్రమాణ సీకారం చేశారు. సభ్యులుగా ఉడుత మహేష్‌కుమార్, దమ్మలపాటి విజయనిర్మల, ఇస్లావత్ గాంధీనాయక్, ఎంబాడి రాంబాబు, సి.వెంకట్రావు, మైలవరపు సుజన, తరిమెళ్ల వనజ, జవ్వాజి లక్ష్మి, ఎక్స్ అఫీషియోగా రత్నకరం తులసి రాఘురామవరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈవో సూర్యప్రకాష్ సభ్యులతో ప్రమాణం చేయించారు.

క్లుప్తంగా

డాక్టర్ నాగూర్‌బాషాకు గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాష ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన గుంటూరు జీజీహెచ్‌లో అనేక రకాల క్లిష్టమైన గ్యాస్ట్రోఎంట్రాలజీ శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేసి పలువురి ప్రాణాలు కాపాడారు. స్థానిక గుంటూరువారితోటలోని కేర్‌వెల్ హాస్పటల్‌లో సామాజిక సేవా దృక్పథంతో ప్రతినెలా ఒక్కో రోగికి రూ. 10వేలు ఖరీదు చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అత్యంత ఖరీదైన అతిక్లిష్టమైన ఆపరేషన్‌లను అతి తక్కు వఖర్చుతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విజయవంతంగా చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డాక్టర్ నాగూర్ బాషా ఈనెల 12న న్యూఢిల్లీలో ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన విషయాన్ని సోమవారం కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌస్ బాషా మీడియాకు వెల్లడించారు. నగరంలోని పలువురు వైద్యులు, కేర్‌వెల్ హాస్పటల్ వైద్యులు, వైద్య సిబ్బంది డాక్టర్ నాగూర్ బాషాకు అభినందనలు తెలిపారు.

12న ఏకపాత్రాభినయ, జానపద నృత్య పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 12న జిల్లాస్థాయిలో ఏకపాత్రాభినయం, జానపద నృత్య (రోల్‌ప్లే, ఫోక్ డ్యాన్స్) పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోయపాలెంలోని డైట్‌లో ఉదయం 10గంటలకు జరగనున్న పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులతో పాటు సంబంధిత పాఠశాల నుంచి ఒక టీచర్ విధిగా హాజరు కావాలని సూచించారు. భోజన సదుపాయం ఉంటుందని, వివరాలకు డైట్ అధ్యాపకులు పి.పోలేరును 9704790917 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గుండె ధైర్యం నింపేలా..



విజయవాడ మెడ్‌స్టార్ ఆస్పత్రిలో చికిత్సకు వచ్చిన గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

- జగన్నామ సంక్షేమం కింద గుండె చికిత్సకు రోగుల తరలింపు
- కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామాల్లో జరిగిన వైద్యశిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్షలకు 40 మంది ఎంపిక
- తొలివిడతగా 20 మంది తరలింపు
- చికిత్స పొందేవారిలో ధైర్యం నింపిన బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



బస్సును ప్రారంభించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: జబ్బు కంటే భయం మనిషికి ఎక్కువ నష్టాన్ని కలుగ జేస్తుందని, అందుకే బజరంగ్ ఫౌండేషన్ పేదల్లోని భయాన్ని పోగొట్టి, ధైర్యాన్ని – మానసిక స్థైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తోందని వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పొన్నూరు మండలం కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామాలలో నిర్వహించిన గుండె సంబంధిత వైద్య పరీక్ష శిబిరంలో వ్యాధి నిర్ధారణ జరిగి యాంజియోగ్రామ్ అవసరమైన 40 మందిలో తొలి విడతగా 20 మందిని ప్రత్యేక బస్సు ద్వారా విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి సోమవారం తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పేరుపేరునా ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మమేకమైన బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంజియోగ్రామ్ టెస్టు చేసే వైద్య బృందానికి సహకరించాలని, ఏ దశలోనూ ఒత్తిడికి గురికావద్దని వారికి సూచించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మక ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ వైద్య సేవలు లభిస్తున్నాయని ప్రత్యేకంగా వివరించారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను ఉచితంగా అందిస్తూ వారి ఆయుష్షు పెంచుతున్న ఆరోగ్య శ్రీ పథకం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. అత్యంత వేగవంతంగా, పారదర్శకంగా, సంతృప్తికరంగా ఆరోగ్యశ్రీ పథకం అమలు జరుగుతున్న తీరును వివరించారు. సోమవారం సాయంత్రానికి 20 యాంజియోగ్రామ్ పరీక్షలు జరగ్గా, వారిలో ఆరుగురికి స్టంట్లు, నలుగురికి బైపాస్ సర్జరీ అవసరమైనట్లు వైద్యులు తెలియజేశారు.

బాధ్యతకు మారుపేరు బజరంగ్ ఫౌండేషన్

జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా 'మీ గుండె పదిలం' నినాదంతో వైద్య శిబిరాన్ని తమకు అత్యంత అందుబాటులో ఏర్పాటు చేయటం మొదలు, ఇంటింటికి వచ్చి తమకు ఏమాత్రం అవగాహన లేకపోయినా, అన్ని తామై నడిపిస్తూ, చెప్పిన మాట ప్రకారమే సోమవారం తెల్లారేసరికి వారికోసమే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసిన తీరుకు కట్టెంపూడి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో.. చెప్పిన మాట చెప్పినట్లు చేతల్లో చూపిస్తూ, నిండు ప్రాణాలు నిలబెడుతున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ సేవలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగాల పేరిట టోకరా

- ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేసిన బాధితులు
- స్పందన ఫిర్యాదులు పునరావృతం కావొద్దన్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



సమస్యలను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం)

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతో మోసగించారని పలువురు బాధితులు, శస్త్రచికిత్సలకు అధికంగా డబ్బులు కాజేశారని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. ప్రజల నుంచి అర్జీలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆలకించారు. అనంతరం పలువురు పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్లలో మాట్లాడారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులను చట్టపరంగా వెంటనే పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు ప్రకాష్‌బాబు (క్రైం), బాలసుందరరావు (ట్రాఫిక్) అర్జీలు స్వీకరించారు.

ఉద్యోగాల పేరుతో..

ఉద్యోగాల పేర్లతో పలువురు మోసగించడంపై బాధితులు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని తెలిసిన వ్యక్తులు నమ్మబలికారు. దీంతో రెండు సార్లుగా వారికి రూ.8 లక్షలు చెల్లించాం. హైదరాబాద్ పంపించి, దరఖాస్తు పూర్తిచేయించారు. ఆరు నెలల్లో ఉద్యోగం వస్తుందని, ఉద్యోగం వచ్చాక రెండు సార్లు తర్ఫీదు ఉంటుందని చెప్పారు. నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో గతంలో చెల్లించిన డబ్బులు ఇవ్వాలని అడిగితే కాలయాపన చేస్తున్నారు. న్యాయం చేయగలరు.

– లక్ష్మీతిరుపతమ్మ, ఉద్యోగనగర్ 4వ వీధి

- తెలిసిన ఓ వ్యక్తి అతని మేనల్లుడితో ఇంటికి వచ్చాడు. గతంలో పలువురికి ఉద్యోగాలు ఇప్పించానని ఆశ చూపాడు. మా పిల్లలకు ఆరోగ్యశ్రీలో సిస్టం క్లర్క్‌గా, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పాడు. ఇద్దరి వద్ద రూ.5.50 లక్షలు తీసుకుని, సుమారు మూడేళ్లు గడిచాయి. అప్పటి నుంచి ఉద్యోగాల ఊసెత్తలేదు. డబ్బుల తిరిగి ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

– సీహెచ్.నాగమణి, ఎస్.పిచ్చమ్మ, షాప్ ఎంప్లాయీస్‌కాలనీ ఒకటో వీధి

- రూ.2.50 లక్షలు చెల్లిస్తే నా కుమారైకు ఉద్యోగం ఇప్పిస్తానని తెలిసిన వ్యక్తి నమ్మబలికాడు. దీంతో ముందస్తుగా రూ.50 వేలు చెల్లించాను. రెండు నెలల్లో ఉద్యోగం వస్తోందని నమ్మించాడు. ఈలోగా మిగతా డబ్బులు ఇవ్వాలని చెప్పాడు. ఇప్పటికి ఎనిమిది నెలలు గడిచినా ఉద్యోగం రాలేదు. అదేమని డబ్బులు అడిగితే ఇవ్వడంలేదు.

– పి.నాంచరయ్య, ఇందిరాగాంధీకాలనీ, పొన్నూరు

చిట్టీల పేరుతో మోసం..

చిట్టీల పేరుతో ఓ మహిళ మోసగించిందని బాధితులు వాపోయారు. పెదకాకాని మండలం కొప్పురావూరులో ఓ మహిళ సుమారు ఏడేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. లక్ష నుంచి రూ.5 లక్షల చిట్టీ పాటలు చేపట్టేది. ఈ క్రమంలో నమ్మకంగా ఉంటున్న ఆమె వద్ద చిట్టీలు వేశాం. చిట్టీ పాటలు ముగిసిన తర్వాత కూడా మాకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదు. అదేమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతోంది. గతంలో రాజధానిగా ఉన్న అమరావతి వైపు వేల గజాల స్థలం కొనుగోలు చేసింది. దాదాపు 15 మందికి సుమారుగా రూ.80 లక్షలు వరకు ఇవ్వాల్సి ఉంది. ఇంకా అనేక మంది బాధితులు ఉన్నారు.

– బాధితులు లక్ష్మీనరసమ్మ, అనిశెట్టి నాగమణి, ఆళ్ల ధనలక్ష్మి, ఓబులుశెట్టి లక్ష్మి తదితరులు

ఆటో ఆచూకీ తెలియరాలేదు..

సుమారు 5 నెలలు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలైన తండ్రి మృతిచెందారు. దీనిపై పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌లో కేసు నమోదైంది. అయితే ఆటోతో ఢీకొట్టిన వ్యక్తి ఎవరనేది ఇప్పటికి వరకు గుర్తించలేదు. అదేమని అడిగితే ఆటో/డ్రైవర్ ఆచూకీ తెలియలేదని చెబుతున్నారు. మేము చుట్టుగుంటలో విచారించగా, ఓ మహిళకు సంబంధించి ఆటో అని తెలిసింది. ఆ దిశగా విచారణ చేయించి, న్యాయం చేయాలని కోరుతున్నాం.

– షేక్ పర్వీనా, కేవీపీ కాలనీ

అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు..

గత పదేళ్లుగా గుంటూరు రైల్వేస్టేషన్‌లో స్వీపర్లుగా పనులు చేస్తున్నాం. అదే స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఓ ఉద్యోగి మాపై అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. దుస్తులు మార్చుకుంటుండగా గదుల్లోకి రావడం, మరుగుదొడ్లలోకి సైతం వస్తున్నాడు. పదే పదే మూత్ర, మలవిసర్జనకు వెళ్లేందుకు అవకాశం లేకుండా ప్రతి ఒక్కరూ డైపర్లు వాడాలని అసభ్యంగా మాట్లాడుతున్నాడు. సదరు ఉద్యోగిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– స్వీపర్లు, గుంటూరు రైల్వేస్టేషన్

గుంటూరు డివిజన్‌లో పలు స్టేషన్‌లకు స్టాప్‌ల కేటాయింపు

సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం పలు స్టేషన్‌లలో స్టాప్‌లు కేటాయించినట్లు డివిజన్ సీనియర్ మేనేజర్(డీసీఎం) దినేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 12795 విజయవాడ- లింగంపల్లి రాత్రి 8.10 గంటలకు విజయవాడ నుంచి బయలు దేరుతుందని, 12796 లింగంపల్లి- విజయవాడ రైలు లింగంపల్లి స్టేషన్ నుంచి ఉదయం 06.50 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్లకు సోమవారం నుంచి నల్గొండ స్టేషన్‌లో స్టాప్ కేటాయించినట్లు చెప్పారు. అదే విధంగా రైలు నెంబర్ 17645 సికింద్రబాద్- రేపల్లె రైలు మధ్యాహ్నం 02.05 గంటలకు సికింద్రబాద్ స్టేషన్ నుంచి బయలు దేరుతుందని, 17646 రేపల్లె- సికింద్రబాద్ రైలు రేపల్లె స్టేషన్ నుంచి ఉదయం 11.54 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఈ రైళ్లు ఈనెల 9వ తేదీ నుంచి చిట్యాల స్టేషన్‌కు స్టాప్ కేటాయించడం జరిగిందని వివరించారు.

సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహా రెడ్డి



కమిషనర్ నరసింహారెడ్డిని సత్కరించిన విశ్రాంత ఉద్యోగులు

పాత గుంటూరు: కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్, సీజీఎస్టీలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి అన్నీ విధాల సహకారం అందిస్తానని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కన్నావారితోటలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ అసోసియేషన్ నాయకులు కమిషనర్ సాధు నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. కమిషనర్ మాట్లాడుతూ పెన్షనర్లు కోరిన వెంటనే గుర్తింపు కార్డులు ఇస్తున్నామని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్‌ను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో టీ వివేకానంద, గద్దె తిలక్, సీతారామయ్య, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

శ్రీదేవి శరన్నవరాత్రులకు ముస్తాబు

వినుకొండ టౌన్: దసరా నవరాత్రుల నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను హిమాలయ గురువులు ఆశీస్సులతో రెండవ పర్యాయం పట్టణ శివారులోని సాయి బృందావనంలో నిర్వహిస్తున్నట్లు వినుకొండ శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు సోమవారం తెలిపారు. భారీ వేదికపై కోల్‌కత కళాకారులచే చెరువు మట్టితో 10అడుగుల అమ్మవార్ల మట్టి విగ్రహాలు కొలువు తీరనున్నాయన్నారు. కార్యక్రమాలలో భాగంగా 9రోజులపాటు 18హోమ గుండాలతో మహాచండీయాగం, విశిష్ట పూజా కార్యక్రమాలు, అమ్మవారికి విశేషమైన అలంకారాలు, అమ్మవార్ల ఊరేగింపు, ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను హిమాలయ గురూజీ చేతుల మీదుగా నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు పెండేల పుల్లారావు, డాక్టర్ ఆనంద్‌కుమార్, పెండేల కాశి, మునిరెడ్డి, పెండేల మోహన్‌రావు, తాత రమేష్, రామడుగు కోటేశ్వరరావుతోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జాతీయ పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలని అథ్లెటిక్ కోచ్ ఈశ్వరరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించనున్న 37వ సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడం అంత సులభం కాదన్నారు. విజయమే లక్ష్యంగా బరిలో దిగాలని తెలిపారు. అనంతరం జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, ఈశ్వరరెడ్డి, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, నూతలపాటి గోపీనాథ్, గమిడి సాంబశివరావు క్రీడా దుస్తులు బహూకరించారు. ఎం.వెంకట మారుతీ గురుశంకర్, పి.నరేంద్ర, సిహెచ్.ఆదినారాయణ, బి.నాగవిహారిక, టి.నాగ యోచన, ఎం.మధుబాబు, ఇ.హేమసాయి, ఎండీ ఆసియా, రూపలిత పాత్ర, ఎస్కే నూర్, ఎస్.కె.రోషన్, ఎస్కే కరిష్మ, ఎం.అఖిల్ వర్దన్, వి.హాసిని.

13 వరకు జాతీయ తపాలా దినోత్సవాలు

పలు కార్యక్రమాలు చేపట్టిన అధికారులు



పోస్టల్ కార్యాలయంలో ఉద్యోగులతో సూపరింటెండెంట్ వీరాస్వామి

నరసరావుపేట: జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం మొదటి రైల్వేగేటు సమీపంలోని పోస్టల్ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. సోమవారం తపాలా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పదోతేదీ మంగళవారం విట్టియా శక్తి కిరణ్ దివస్ అనగా పోస్టల్ అకౌంట్లు తెరిపించటం, 11వ తేదీ బుధవారం ఫిలాటికల్‌డే అనగా రకరకాల స్టాంపులు, నాణేలు సేకరణ, ఫిలాటికల్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేయటం, 12వ తేదీ గురువారం మెయిల్స్, పార్సిల్స్, చివరిరోజు 13వ తేదీన అంత్యోదయ దివస్‌లో భాగంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవలు, పోస్టాఫీసు ద్వారా చెల్లింపులు నిర్వహించటం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలు పాల్గొని సహకరించాలని కోరారు.

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడిగా వి.సురేష్ ఏకగ్రీవం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా వీరపనేని సురేష్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశంతో పాటు ఉమ్మడి జిల్లా శాఖకు కార్యవర్గ ఎన్నిక పంచాయతీరాజ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీవీ సూర్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా డిప్లొమా ఇంజినీర్స్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్ర రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా పూర్వపు అధ్యక్షుడు అట్లూరి రాంబాబు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శిగా జి.కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా జి.దేవసహాయం, ఉపాధ్యక్షునిగా పీఎస్వీ ఎస్ఎస్ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.ఇస్సాకు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ ఖాదర్‌వలి, సంయుక్త కార్యదర్శులుగా బి.కృష్ణానాయక్, టి.నాగరాజు, పి.రహంతుల్లాతో పాటు ఈసీ మెంబర్లుగా 11 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో మస్తాన్ వలి ప్రతిభ

పిడుగురాళ్ల: బాడీ బిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన మస్తాన్ వలి ప్రతిభ చూపాడు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించిన సెంట్రల్ జోన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. పల్నాడు జిల్లా నుంచి పిడుగురాళ్ల ఓయాసిస్ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న మస్తాన్‌వలికి మాత్రమే అవకాశం రావటం బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో మూడో బహుమతి కైవసం చేసుకోవటంతో పలువురు అభినందించారు.

మానసిక ఆరోగ్యం అందరికీ అవసరం

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్
- జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు

ఏఎన్‌యూ: సమాజంలో మానసిక ఆరోగ్యానికి ఎంతో ప్రాముఖ్యం పెరిగిందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈనెల 14న యూనివర్సిటీ సైకాలజీ విభాగం, సైకాలజిస్టుల సంఘం ఏపీఏ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో మానసిక ఆరోగ్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో అన్ని వర్గాల్లోనూ మానసిక సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, వీటిపై అవగాహన కల్పించడమే దీనికి సరైన మందు అని ఆయన అభిప్రాయపడ్డారు. సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ మానసిక అంశాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైకాలజీ విభాగం అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వసంతరావు, అధ్యాపకులు డాక్టర్ టీడీ విమల, ఎస్.అనుపమ, ఏపీఏ ఇండియా ప్రతినిధులు కృష్ణ భరత్, తేజ పాల్గొన్నారు.



అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌కూ శుబ్‌మన్ గిల్ దూరం

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఓపెనర్ శుబ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌కూ దూరమయ్యాడు. బుధవారం అఫ్గానిస్తాన్ జట్టుతో మ్యాచ్ ఆడేందుకు ఢిల్లీ బయలుదేరిన భారత జట్టు వెంట గిల్ వెళ్లలేదు. డెంగీ జ్వరం బారిన పడ్డ గిల్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, చెన్నైలో వైద్యుల పర్యవేక్షణలో అతను చికిత్స తీసుకుంటున్నాడని బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లోనూ గిల్ ఆడలేదు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-3తో మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్)-ఆండ్రియా మీస్ (జర్మనీ) జంటపై గెలిచింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.

వెర్‌స్టాపెన్ ‘హ్యాట్రిక్’

- వరుసగా మూడో ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం
- ఈ సీజన్‌లో 14వ విజయం



దోహా: వేదిక మారినా ఫలితం మారలేదు. ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 14వ విజయం నమోదు చేసుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఖతర్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ చాంపియన్‌గా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 27 నిమిషాల 39.168 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్కార్ పియస్ట్రీ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, లాండో నోరిస్ (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) తొలి ల్యాప్‌లోనే వెనుదిరిగారు. ఈ ఫలితంతో వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో మరో ఐదు రేసులు మిగిలి ఉండగానే 433 పాయింట్లతో ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17 రేసులు ముగిశాయి. ఇందులో 14 రేసుల్లో వెర్‌స్టాపెన్, రెండు రేసుల్లో పెరెజ్ (రెడ్‌బుల్), మరో రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. 2021, 2022లలో కూడా వెర్‌స్టాపెన్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి ఈనెల 22న జరుగుతుంది.

‘ధర్మశాల’ అవుట్ ఫీల్డ్‌పై బట్లర్ అసంతృప్తి





ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా నేడు ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లు తలపడనున్నాయి. అయితే ఇంగ్లండ్ సారథి బట్లర్ ధర్మశాల స్టేడియంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చాడు. మీడియాతో మాట్లాడుతూ ‘ఈ మైదానం పేలవంగా ఉంది. అవుట్‌ఫీల్డ్ ఆటగాళ్లకు ప్రమాదకరం. క్యాచ్‌లు పట్టేటపుడు, డైవింగ్ చేసేటపుడు ఫీల్డర్లు జాగ్రత్తగా వ్యవహరించాలి. పరుగు ఆపేందుకు డైవ్ చేస్తే గాయాల బారిన పడొచ్చు. ఐపీఎల్‌లో ఆడినప్పటిలా ఈ అవుట్‌ఫీల్డ్ లేదు. ఇది క్రికెటర్లకు ఇబ్బందికరం’ అని బట్లర్ అన్నాడు. బౌలర్లకు ప్రత్యేకించి పేసర్లు రనప్ ఏరియాను ఓ కంట కనిపెడుతూనే బౌలింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. ఈ వేదికపై అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు బంతిని అందుకునే క్రమంలో పదేపదే జారి పడ్డారు. దీంతో అఫ్గాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ అవుట్‌ఫీల్డ్ చెత్తగా ఉందన్నాడు.

లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌లో క్రికెట్!

ఐఓసీ ఆమోదమే తరువాయి

దుబాయ్: లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మ్యాచ్‌లకు టాస్ పడే అవకాశాలు మెరుగయ్యాయి. 2028లో అమెరికాలో జరిగే ఈ విశ్వక్రీడల కోసం నిర్వాహకులు క్రికెట్ క్రీడను చేర్చేందుకు సిఫారసు చేశారు. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) హర్షం వ్యక్తం చేసింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహణ కోసం ఐసీసీ... లాస్ ఏంజెలిస్ నిర్వాహక కమిటీతో కొంతకాలంగా సంప్రదింపులు జరుపుతోంది. మొత్తానికి కమిటీ సిఫారసు చేయడంతో ఇక అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆమోదమే మిగిలుంది. ఐఓసీ ఓకే అంటే అమెరికాలో క్రికెట్ ఆటకు రంగం సిద్ధమవుతుంది. ఈనెల 15 నుంచి 17 వరకు ముంబైలో జరిగే ఐఓసీ సమావేశంలో క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో క్రీడాంశంగా చేర్చాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు.

కివీస్ గెలుపు జోరు...

ప్రపంచకప్‌లో మరో ఏకపక్ష విజయం... గత టోర్నీ రన్నరప్ న్యూజిలాండ్ సమష్టి ప్రదర్శన ముందు అసోసియేట్ టీమ్ నెదర్లాండ్స్ నిలవలేకపోయింది... బ్యాటింగ్ పిచ్‌పై ముందుగా భారీ స్కోరు నమోదు చేసిన న్యూజిలాండ్ విసిరిన సవాల్‌కు పసికూన నెదర్లాండ్స్ వద్ద జవాబు లేకపోయింది... ఫలితంగా కివీస్ ఖాతాలో వరుసగా రెండో విజయం చేరగా... హైదరాబాద్ వేదికగా ఆడిన రెండు మ్యాచుల్లోనూ డచ్ బృందానికి ఓటమే ఎదురైంది. బ్యాటింగ్‌లో విల్ యంగ్, లాథమ్, రచిన్ రవీంద్ర, బౌలింగ్‌లో సాన్‌ట్నర్ న్యూజిలాండ్ విజయసారథులుగా నిలిచారు.

- న్యూజిలాండ్‌కు రెండో విజయం
- 99 పరుగులతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన యంగ్, సాన్‌ట్నర్

సాక్షి, హైదరాబాద్: న్యూజిలాండ్ జట్టు తమపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మళ్లీ సత్తా చాటింది. విడిగా చూస్తే విధ్వంసక ప్రదర్శనలు లేకపోయినా... ప్రతీ ఒక్కరూ రాణించడంతో క్వాలిఫయర్ జట్టు నెదర్లాండ్స్‌పై కివీస్ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో న్యూజిలాండ్ 99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. విల్ యంగ్ (80 బంతుల్లో 70; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ లాథమ్ (46 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (51 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... డరైల్ మిచెల్ (47 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కొలిన్ అకెర్‌మన్ (73 బంతుల్లో 69; 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాన్‌ట్నర్ (5/59) ఉప్పల్ స్టేడియంలో వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

సమష్టి బ్యాటింగ్‌తో...

ఆశ్చర్యకర రీతిలో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ బాగా నెమ్మదిగా ప్రారంభమైంది. తొలి మూడు ఓవర్లూ ఒక్క పరుగు లేకుండా మెయిడిన్లుగా ముగియడం విశేషం. అయితే ఆ తర్వాత జట్టు ధాటిని పెంచింది. కాన్వే (40 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), యంగ్ చక్కటి బ్యాటింగ్‌తో తర్వాతి 7 ఓవర్లలో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 పరుగులు రాబట్టారు. ఈ జోడీ విడిపోయిన తర్వాత వచ్చిన రచిన్ తన ఫామ్‌ను కొనసాగించాడు. 59 బంతుల్లో యంగ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, రచిన్‌కు హాఫ్ సెంచరీ కోసం 50 బంతులే సరిపోయాయి. మరో ఎండ్‌లో మిచెల్ కూడా జోరు ప్రదర్శించాడు. కానీ ఈ దశలో డచ్ బౌలర్లు ప్రత్యర్థిని కొద్దిసేపు నిలువరించారు. 16 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి దెబ్బ కొట్టారు. అయితే మరోవైపు లాథమ్ దూకుడు కివీస్ స్కోరును 300 వందలు దాటించింది. సాన్‌ట్నర్ (17 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా చెలరేగడంతో చివర్లో భారీ స్కోరు చేయడంలో న్యూజిలాండ్ సఫలమైంది. ఆఖరి 10 ఓవర్లలో 84 పరుగులు సాధించిన న్యూజిలాండ్ వీటిలో చివరి 3 ఓవర్లలోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 పరుగులు రాబట్టడం విశేషం.



సాన్‌ట్నర్



యంగ్



రచిన్



లాథమ్

అకెర్‌మన్ మినహా...

భారీ లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఏ దశలోనూ నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ వేగంగా సాగలేదు. పాక్‌తో మ్యాచ్‌తో పోలిస్తే జట్టు బ్యాటింగ్ ఈ సారి పేలవంగా కనిపించింది. ఓపెనర్లు విక్రమ్‌జిత్ (12), డౌడ్ (16) విఫలం కాగా, అకెర్‌మన్ ఒక్కడే పోరాడగలిగాడు. అకెర్‌మన్, తేజ నిడమనూరు (26 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) మధ్య నమోదైన 50 పరుగుల భాగస్వామ్యమే ఈ ఇన్నింగ్స్‌లో పెద్దది. క్రీజ్‌లో నిలదొక్కుకొని చక్కటి షాట్లతో జోరు పెంచిన దశలో తేజ లేని రెండో పరుగు కోసం అనవసరంగా ప్రయత్నించాడు. అకెర్‌మన్‌తో సమన్వయ లోపంతో అతను రనౌటయ్యాడు. 55 బంతుల్లో అకెర్‌మన్ అర్ధ సెంచరీ పూర్తయింది. చివర్లో స్కాట్ ఎడ్వర్డ్స్ (27 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్), సైబ్రాండ్ (34 బంతుల్లో 29; 3 ఫోర్లు) కొంత వరకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. లక్ష్యానికి చాలా దూరంలో నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ ముగిసింది.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X బంగ్లాదేశ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి

పాకిస్తాన్ X శ్రీలంక
వేదిక: హైదరాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) డి లీడ్ (బి) వాండర్ మెర్వ్ 32; యంగ్ (సి) డి లీడ్ (బి) మీకెరెన్ 70; రచిన్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాండర్ మెర్వ్ 51; మిచెల్ (బి) మీకెరెన్ 48; లాథమ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) దత్ 53; ఫిలిప్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 4; చాప్‌మన్ (సి) వాండర్ మెర్వ్ (బి) దత్ 5; సాన్‌ట్నర్ (నాటౌట్) 36; హెన్రీ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 322. వికెట్ల పతనం:** 1-67, 2-144, 3-185, 4-238, 5-247, 6-254, 7-293. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-2-62-2, ర్యాన్ క్లీన్ 7-1-41-0, మీకెరెన్ 9-0-59-2, వాండర్ మెర్వ్ 9-0-56-2, అకెర్‌మన్ 4-0-28-0, డి లీడ్ 10-0-64-1, విక్రమ్‌జిత్ 1-0-9-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (బి) హెన్రీ 12; డౌడ్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 16; అకెర్‌మన్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 69; డి లీడ్ (సి) బౌల్ట్ (బి) రచిన్ 18; తేజ (రనౌట్) 21; ఎడ్వర్డ్స్ (సి అండ్ బి) సాన్‌ట్నర్ 30; సైబ్రాండ్ (సి) కాన్వే (బి) హెన్రీ 29; వాండర్‌మెర్వ్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 1; క్లీన్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 8; ఆర్యన్ దత్ (బి) హెన్రీ 11; మీకెరెన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 223. వికెట్ల పతనం:** 1-21, 2-43, 3-67, 4-117, 5-157, 6-174, 7-180, 8-198, 9-218, 10-223. **బౌలింగ్:** బౌల్ట్ 8-0-34-0, హెన్రీ 8.3-0-40-3, సాన్‌ట్నర్ 10-0-59-5, ఫెర్గూసన్ 8-0-32-0, రచిన్ రవీంద్ర 10-0-46-1, ఫిలిప్స్ 2-0-11-0.

సినిమా


కథ విన్నారా?



నాగార్జున

హీరో నాగార్జున, తమిళ దర్శకుడు నవీన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇటీవల నాగార్జునను కలిసి, ఓ కథ వినిపించారట నవీన్. స్క్రిప్ట్ నచ్చడంతో నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ప్రస్తుతం ఈ స్క్రిప్ట్‌కు పూర్తిస్థాయిలో మెరుగులుదిద్దే పనిలో నవీన్ ఉన్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జోరుగా సాగుతోంది. అంతేకాదు.. నాగార్జున కెరీర్‌లో ఇది వందో చిత్రమట. మరోవైపు ప్రస్తుతం ‘నా సామిరంగ’ సినిమా చేస్తున్నారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాకు శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరిలో ‘నా సామిరంగ’ విడుదల కానుంది.


మార్చిలో మొదలు?



మహేశ్ బాబు

‘గుంటూరుకారం’ సినిమాతో బిజీగా ఉన్నారు హీరో మహేశ్ బాబు. ‘అతడు’, ‘ఖలేజా’ చిత్రాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్‌తో మహేశ్ చేస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. అయితే దర్శకుడు రాజమౌళితో మహేశ్ బాబుకు ఓ సినిమా కమిట్‌మెంట్ ఉన్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు విజయేంద్ర ప్రసాద్ కథ సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ కథ ఓ కొలిక్కి వచ్చిందని, మార్చిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను మొదలు పెట్టేలా రాజమౌళి అండ్ కో ప్రణాళికలు రచిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

ఒక్కటి గుర్తు పెట్టుకోండి!



జీవా, మమ్ముట్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో దర్శకుడు మహి వి.రాఘవ్ తెరకెక్కించిన చిత్రం ‘యాత్ర’. వైఎస్‌ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించారు. 2019 ఫిబ్రవరి 8న విడుదలైన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా ‘యాత్ర 2’ మూవీని తెరకెక్కిస్తున్నారు మహి వి.రాఘవ్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని కొన్ని ఘటనల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ మూవీలో వైఎస్ జగన్ పాత్రలో తమిళ హీరో జీవా నటిస్తున్నారు. ‘యాత్ర’లో వైఎస్‌ఆర్ పాత్ర పోషించిన మమ్ముట్టి ‘యాత్ర 2’ లోనూ అదే పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలోని వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ‘నేనెవరో ఇంకా ఈ ప్రపంచానికి తెలియకపోవచ్చు. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి... నేను వైఎస్ రాజశేఖర రెడ్డి కొడుకుని’ అనే అనే డైలాగ్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఉన్నాయి. మహి వి.రాఘవ్ మాట్లాడుతూ– ‘‘వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల నేపథ్యంలో ‘యాత్ర 2’ రూపొందుతోంది. ఈ సినిమాని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం’’ అన్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యులాయిడ్‌పై శివ మేక నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.

వినోదాల ప్రేమ



కార్తీక్ రత్నం

కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా ఆనంద్ బడా దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ ‘లింగొచ్చా..’. ‘గేమ్ ఆఫ్ లవ్’ అనేది ఉపశీర్షిక. జె.నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఆనంద్ బడా మాట్లాడుతూ– ‘‘హైదరాబాద్ నేపథ్యంలో సాగే లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ డ్రామా ‘లింగొచ్చా..’’ అన్నారు. ఈ సినిమాకు సంగీతం: బికాజ్ రాజ్, సహ నిర్మాత: మల్లేష్ కంజర్ల.



రెజీనా

మరికాస్త ముందుకు ఎక్స్‌ట్రా



నితిన్

అనుకున్న సమయానికంటే ముందుగానే థియేటర్స్‌కు వస్తున్నారు హీరో నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్ హీరోగా ‘ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్’ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను తొలుత డిసెంబరు 23న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఆ సమయానికి ప్రభాస్ హీరోగా నటించిన ‘సలార్:సీజ్‌ఫైర్’ చిత్రం రిలీజ్‌కు సిద్ధం కావడంతో ‘ఎక్స్‌ట్రా’ని కాస్త ముందుగానే డిసెంబరు 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు హారిస్ జైరాజ్ స్వరకర్త.

నాకూ అలా అనిపిస్తోంది - విశ్వక్ సేన్



విశ్వక్ సేన్, ఆనంది, రోహిత్

‘‘‘విధి’ నిర్మాత రంజిత్ నాకు మంచి స్నేహితుడు. ప్రొడక్షన్‌లో సాయం చేసేందుకు, సపోర్ట్‌గా నిలిచేందుకు నాకూ ఓ బ్రదర్ ఉంటే బాగుండని ఈ దర్శకుల్ని(శ్రీకాంత్, శ్రీనాథ్) చూస్తుంటే అనిపిస్తోంది. ‘విధి’ టీజర్ బాగుంది.. సినిమా పెద్ద హిట్ కావాలి.. నిర్మాతకు మంచి లాభాలు రావాలి’’ అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ దర్శకద్వయం తెరకెక్కించిన చిత్రం ‘విధి’. రంజిత్ ఎస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 3న విడుదలకానుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వక్ సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ ఎస్ మాట్లాడుతూ–‘‘మా సినిమా కథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. కథ, కథనాలను ప్రేక్షకులు ముందుగా ఊహించలేరు’’ అన్నారు. ‘‘మనం మాట్లాడటం కంటే.. మనం తీసే సినిమానే మాట్లాడాలనుకుంటున్నాం’’ అన్నారు శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్. ‘‘మా సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి’’ అన్నారు రోహిత్ నందా, ఆనంది.

యూత్‌ఫుల్ కిస్మత్



అభినవ్, విశ్వ, నరేష్

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, అవసరాల శ్రీనివాస్, విశ్వ దేవ్, రియా సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘కిస్మత్’. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రాజు నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హీరో సత్యదేవ్ విడుదల చేశారు. ‘‘బెస్ట్ బడ్డీస్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫన్ రైడ్ ‘కిస్మత్’. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వేదరామన్ శంకరన్, సహ నిర్మాత: సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి.

చదువు గొప్పదనం నేపథ్యంలో...



అభయ్ నవీన్, కుశాలిని

‘‘‘రాక్షస కావ్యం’ బడ్జెట్ పరంగా చిన్న సినిమా. కానీ, కథ పరంగా పెద్ద సినిమా. పురాణాల్లోని జయవిజయ పాత్రల్ని స్ఫూర్తిగా తీసుకుని, కలియుగంలో వారు జన్మిస్తే ఎలా ఉంటుంది? అనే ఊహతో ‘రాక్షస కావ్యం’ తీశా’’ అని డైరెక్టర్ శ్రీమాన్ కీర్తి అన్నారు. అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘రాక్షస కావ్యం’. దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దామురెడ్డి మాట్లాడుతూ–‘‘ఇదొక వైవిధ్యమైన ప్రయోగాత్మక చిత్రం. ఈ మూవీలో ఫ్యామిలీ డ్రామా, భావోద్వేగాలతో పాటు చదువు గొప్పదనాన్ని చెబుతున్నాం’’ అన్నారు. ‘‘ఇటీవల వేసిన ప్రీమియర్స్‌కి మంచి స్పందన వచ్చింది’’ అన్నారు అభయ్ నవీన్. నటీనటులు కుశాలిని, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు, అన్వేష్ మైఖేల్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: నవీన్ రెడ్డి, వసుంధరా దేవి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ చిక్కు.

లక్కీ చాన్స్

దక్షిణాది ప్రేక్షకులకు హీరోయిన్ రెజీనా సుపరిచితురాలే. కానీ ఇటీవల కాలంలో ఈ బ్యూటీకి చెప్పుకోదగ్గ హిట్ దక్కలేదు. ఇలాంటి సమయంలో రెజీనాకు ఓ లక్కీచాన్స్ లభించిందని కోలీవుడ్ టాక్. అజిత్ హీరోగా మగిళ తిరుమేణి దర్శకత్వంలో ‘విడాముయార్చి’ అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నారని సమాచారం. అలాగే కథ రీత్యా ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చాన్స్ ఉందని, ఈ అవకాశం రెజీనా తలుపు తట్టిందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. మరి.. ఈ మూవీలో రెజీనా నటిస్తారా? లేదా? వేచి చూడాలి. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారు.


అంబాజీపేట బ్యాండు



సుహాస్, శివాని

సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం ‘అంబాజీపేట మ్యారేజీ బ్యాండు’. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ విడుదలలో దర్శకులు మారుతి, హను రాఘవపూడి, శైలేష్ కొలను, సాయి రాజేశ్, సందీప్ రాజ్, ప్రశాంత్, మెహర్ రమేశ్, భరత్ కమ్మ, నిర్మాతలు ఎస్‌కేఎన్, శరత్ అతిథులుగా పాల్గొన్నారు. ‘‘నాలాంటి కొత్త డైరెక్టర్‌కు చాన్స్ ఇచ్చిన అల్లు అరవింద్, ‘బన్ని’ వాసు, వెంకటేష్ మహాగార్లకు, సుహాస్‌కి థ్యాంక్స్’’ అన్నారు దుశ్యంత్ కటికినేని. ‘‘నా కెరీర్‌లో ఈ మూవీ మైలురాయిగా నిలుస్తుంది’’ అన్నారు సుహాస్. సినిమాటోగ్రాఫర్ వాజిద్ బేగ్, మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర మాట్లాడారు.

హారర్ కామెడీ



పూజిత, శివ, జ్యోతి

శివ, గోవా జ్యోతి, స్వర్ణలత, పూజిత, సుమన్ శెట్టి, అప్పారావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘యజ్ఞ’. చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో ఆర్‌ఆర్ మూవీ క్రియేషన్స్‌పై చిలుకోటి రఘురామ్, చలపల్లి విఠల్ గౌడ్, చిత్తజల్లు ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్, పాటల విడుదల వేడుకలో తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నిర్మాత సాయి వెంకట్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు. ‘‘వినోదం, ప్రేమ, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ రూపొందుతోంది’’అన్నారు చిత్తజల్లు ప్రసాద్. ‘‘మా చిత్రంలోని నటీనటులకు మంచి పేరు వస్తుంది’’ అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సమర్పణ: దేశ్‌పాండే, సుభాష్, రావ్(దొర) ముళ్లవరం, కెమెరా: జి.కృష్ణనాయుడు, సంగీతం: లక్ష్మణ సాయి.